


# చిన్నారి చెప్పిన కన్నీటిగాథ

ఎప్పుడూ చీకటిపడందే ఇల్లు చేరని మా వారు ఆనాడు సాయంత్రం ఆరు గంటలకే ఇంట్లో ఉండడం ఒక విశేషం. రానున్న రెండు రోజులు సెలవదినాలైనా ఆఫీసుఫైల్స్ మోసుకుని రాకపోవడం అంతకన్నా విశేషమే! భోజనాలు అయినాక తీరికగా ముందుగదిలో వారపత్రిక తిరగవేస్తున్నాను. మా వారు వారి పుస్తకాలు అన్నీ సర్దుకుంటూ వాటి మధ్యనున్న పాత ఆల్బమ్ ఏదో పరీక్షగా చూస్తున్నారు. "దీపావళి కథలపోటీకి మనమిద్దరం ఉమ్మడిగా ఒక కథ వ్రాసి పంపుదామా?" అన్నాను నవ్వుతూ. అంతవరకూ ఏదో ఆలోచిస్తూ ఫోటో ఆల్బమ్ చూస్తున్న వారు నన్ను పిలిచి "ఇలా వచ్చి ఈ కుక్కపిల్ల చెప్పే కథవిను" అని ఒక ఫోటో చూపించారు. అందులో సుమారు నాలుగు, అయిదు ఏండ్ల బాబు ముద్దులు మూటకడుతున్నాడు. అతని చిన్నారి చేతుల్లో తెల్లని కుక్కపిల్ల ఎంతో చురుగ్గా చూస్తోంది. ఇంతలో నా కుతూహలాన్ని అర్థం చేసుకున్న మా వారు "వాడు మా చిన్నతమ్ముడు గోపీ. వాడి చేతిలో ఉన్న కుక్కపిల్ల వాడు పెంచుకున్న టామీ" అని ఇలా చెప్పడం ప్రారంభించారు:

"మా తమ్ముడు గోపీ మా అందరిలోను చిన్నవాడు. అందరికీ వాడంటే అపరిమితమైన ప్రేమ. మా నాన్నగారికి వాడే పంచప్రాణాలూను. అనంతం గోపీకంటె మూడేళ్ళు పెద్ద. అందుచేత వాడు మాత్రం గోపీమీద పెద్దరికం చలాయించేవాడు. గోపీ దాచుకున్న బొమ్మల్ని విరగగొట్టి వాడిని ఏడిపించేవాడు. గోపీ ఈ పెద్దరికాన్ని సహించక ఎదిరించేవాడు. ఈ కారణంచేత మా మధ్య సుమారు పది ఏళ్లవయసులో తేడా ఉన్నా గోపీ నన్ను ఆశ్రయించేవాడు. ఇంట్లో నేను ఉన్నంతవరకు నా గదిలో బొమ్మలు గీసుకుంటూ, ఆడుకుంటూ, పాడుకుంటూ, ధర్మసందేహాలు నివృత్తి చేసుకుంటూ గడిపేవాడు. నాన్నగారు గోపీని ఎప్పుడూ కొట్టేవారుకారు కాని, అమ్మ మాత్రం ఎప్పుడైనా సహనం లోపిస్తే గోపీని గట్టిగా మందలించడమో, కొట్టడమో మామూలే. అప్పుడు నన్ను వెతుక్కుంటూ వచ్చి వెక్కివెక్కి ఏడ్చేవాడు. నేను ఊరడిస్తే ఇట్టే ఏడుపు మరిచి కబుర్లలో పడేవాడు.

సహజంగా పసివాళ్లది చపలచిత్తం. గోపీలో ఈ స్వభావం ఒకటి రెండుపాళ్ళు ఎక్కువ అనే చెప్పాలి. నాన్నగారు ఎన్నెన్ని ఆటవస్తువులు, బొమ్మలు, బొంగరాలు, గాలిపడగలు కొనేవారో చెప్పలేను. ఇన్ని కొన్నా ఏ ఒక వస్తువు రెండు రోజులు మించి ఆదరించేవాడు కాదు. కొనితెచ్చిన రోజున మాత్రం నిద్ర, ఆహారంకూడా మాని ఆ ఆటవస్తువుతో ఆడేవాడు. దానిపై అనంతంగాని, అక్కలిద్దరు కాని చెయ్యి వేస్తే ఊరుకొనేవాడు కాదు. ఆ మరునాడే ఆ వస్తువు పాతబడిపోయేది. ఓ మూల దానిని పారవేసి

ఏమీ తోచక కూర్చునేవాడు.

గోపీ సమవయస్కులు మా ఇంటి పరిసరాల్లో లేకపోవడం వాడికి ఒక పెద్ద సమస్య అయింది. కాస్త దూరంగా వెళ్లి కొందరు పల్లె పిల్లలతో ఆడుకువచ్చేవాడు. కానీ అసహ్యకరమైన తిట్లు, మాటలు నేర్చుకుని వాళ్లను ఇంటిలో అనుకరించడం చూసి నాన్నగారు వాడిని ఇల్లు విడిచి ఒంటరిగా ఎక్కడికీ వెళ్లనిచ్చేవారు కాదు.

మా మామయ్య టోకియోనుండి వస్తూ గోపీకి ఒక చక్కటి బొమ్మ తీసుకువచ్చాడు. మిలమిల మెరిసే కళ్లు, గులాబీరంగు బుగ్గలు, నవ్వులొలకబోస్తున్న ఎర్రని పెదవులు, సిల్కుగౌను, కాళ్లకు సాక్సు ఆ బొమ్మకు జీవం పోస్తున్నాయి. దానిని పడుకోపెడితే కన్నులు మూసుకుంటుంది. నిలిపితే కన్నులు తెరుస్తుంది. ఇంక ఆ బొమ్మ చేతిలో పడ్డాక గోపీ ఉత్సాహానికి మేరలేదు! దానిని అందరికీ చూపించాడు కాని, ఎవ్వరిని తాకనివ్వలేదు. దానితో నా గదిలో ఆడుకొంటూ తరవాత శ్రద్ధగా దాచుకునేవాడు. వారం రోజుల తరవాత కిటికీలో ఓ మూల ఏ రక్షణా లేకుండా పడిఉన్న ఆ నిర్భాగ్యపుబొమ్మవైపు చూస్తే నాకు జాలివేసింది. "ఏమిరా, గోపీ, నీ బొమ్మను ఇలా పారేశావు? " అన్నాను. "ఆ బొమ్మ నాకు వద్దు. అది ఎప్పుడూ నవ్వుతుంది. దాన్ని కొట్టినా నవ్వుతుంది!" అన్నాడు. ఇటువంటి గోపీగాడి జీవితంలో ఒక కొత్త చైతన్యం తీసుకొనివచ్చింది ఆనాటి సాయంత్రం సంఘటన.

నేను గోపీని తీసుకుని సాయంత్రం మా క్లాస్‌మేట్ ప్రసాదరావు ఇంటికి వెళ్లాను. "మా కుక్క పది రోజుల క్రితం నాలుగు కుక్కపిల్లల్ని పెట్టింది. చాలా బాగున్నాయి. చూస్తావా!" అని చూపించాడు. వాటిలో రెండు పిల్లలు తెల్లగా ఉన్నాయి. వెన్నుమీద మాత్రం నల్లనిమచ్చ ఆ రెండింటికి ఉంది. నుదురుపై బొట్టు పెట్టినట్లు రెండింటికి నిలువైన నల్లని మచ్చలు ఒకే విధంగా ఉండటంచేత అవి రెండు కాస్తఅయినా తేడా లేకుండా ఉన్నాయి. మిగిలిన రెండూ ఊదారంగులో వేరువేరుగా ఉన్నాయి. ఈ నాలుగు పిల్లలూ తల్లిదగ్గిర గునగునమంటూ పాలు తాగుతూఉంటే పరికొత్త ఊలుబంతుల్లా ఉన్నాయి.

గోపీ ఉత్సాహంగా పిల్లల్ని చూస్తూ దగ్గిరగా వెళ్లి నిలబడ్డాడు. ప్రశాంతంగా పిల్లలకు పాలిస్తున్న తల్లి గోపీని చూసి కాస్త బెదిరి, ప్రశ్నార్థకంగా చూసినా, దగ్గిరనే ప్రసాదరావుకూడా నిలుచుండడంవల్ల, నేను, గోపీ ఆ ఇంటికి తరుచు వెళ్లే పరిచితులము కావడం వల్ల మళ్లీ నిశ్చింతగా పాలు ఇస్తూ పడుకుంది. కడుపు నిండిన తరవాత పిల్లలు కాస్త ఇటూ అటూ తిరుగుతూ ఉంటే గోపీ వాటిని చూస్తూ ఆడుకున్నాడు. ఈ ఉత్సాహం చూసి "గోపాల్, నువ్వుకూడా ఒక పిల్లని పెంచుకుంటావా, ఇస్తాను" అన్నాడు ప్రసాదరావు. వెంటనే గంతువేసి "ఆ బొట్టు పెట్టుకున్న కుక్కపిల్లల్లో ఒకటి కావాలి" అని ఎన్నికకూడా చేసుకున్నాడు. "మా ఎదరింటి చౌదరిగారు ఆ తెల్లకుక్కపిల్లల జతలో ఒకటి కావాలని మొన్ననే అడిగారు. రెండవది నీకు కావలిస్తే తీసుకో! పది రోజులు

*మనిషికి కుక్కకు పురాణ మైత్రి ఉన్నది. స్నేహ వాత్సల్యాల విలువను మనిషికన్న, మిన్నగా అర్థంచేసుకోగలిగిన జంతువు కుక్క. తనను ప్రేమించినవారి కోసం ప్రాణంపెట్టగల దొడ్డ గుణం దానికే ఉంది.*

పోయాక, అప్పుడు పాలుపోసి పెంచడం ఏమంత కష్టం కాదు" అన్నాడు నా స్నేహితుడు. గోపీ పట్టుదలవల్ల పదిరోజుల తరవాత వాడు ఎన్నుకున్న కుక్కపిల్ల మా ఇంటికి వచ్చింది. అయితే అంత సులభంగా అది రాలేదు.

దాన్ని తీసుకురావడాన్ని గురించి పెద్ద చర్చ జరిగింది. మా అమ్మ మొదటినుండి తీవ్రంగా ప్రతిఘటించింది. ఇంట్లో కుక్క ఉంటే మడీ, ఆచారం జరగదంది. అన్నిటిలో కుక్క మూతి పెడితే అసహ్యం అన్నది. నాకు, గోపీకి కుక్కపిల్లని చూసిన నాటినుండీ దాన్ని తెచ్చుకోవాలని ఉంది. మా ఇద్దరి ఉత్సాహం చూసి మా పక్షం చేరిపోయారు నాన్నగారు. ఈ వాగ్వాదం జరుగుతూ ఉంటే ఏమీ తెలియక, గోపీ చేతుల్లో ముద్దుగా ఇమిడిపోయి, అందరి ముఖాల్లోకి క్రొత్తగా చూస్తూంది ఆ కుక్కపిల్ల. "దీని పేరేమిటన్నయ్యా!" అన్నాడు గోపీ. "టామీ" అన్నాను నేను.

ఇంక దాన్ని "టామీ—టామీ" అని పిలుస్తూ అది పాలు తాగందే వాడు భోజనం చేసేవాడు కాదు. అందరితోపాటు నాన్నగారు ఇచ్చిన బిస్కట్లు జాగ్రత్తగా దాచి, దానికొక ముక్క ఇచ్చి, వాడింకొక ముక్క తినేవాడు. వంటగదిలోకి, భోజనాల గదిలోకి గోపీ కుక్కపిల్లను తీసుకునివెళితే అమ్మ విసుక్కుని "టామీ" ని తరిమికొట్టేది. గోపీకి పట్టుదల ఎక్కువై భోజనం చేస్తున్నప్పుడుకూడా టామీ తన వద్దనే ఉండాలి అని మారాం చేశాడు. నేను తగినట్లుగా నచ్చచెప్పి "వంటగదిలోకి, భోజనాలగదిలోకీ కుక్క రాకూడదు!" అని, అలా మారాం చేస్తే టామీని ప్రసాదరావుకు తిరిగి ఇచ్చేస్తానని అన్నాను. టామీ గృహప్రవేశానికి నా పలుకుబడి కాస్త ఉందని తెలుసుకున్న గోపీ నే చెప్పిన మాటకు సమాధానపడ్డాడు. పొరపాటున టామీ—వంటగదిలోకి, భోజనాల గదిలోకి పరుగుపెడితే గోపీకూడా — అవతలకు తరిమేవాడు. ఇంటిలోని సభ్యులంతా—చివరికి గోపీకూడా—టామీమీద ఈ నిబంధన విధించడంవల్ల క్రమంగా ఆ ప్రాంతాల్లో తప్ప మిగిలిన ఇంట్లో స్వేచ్ఛగా తిరగవచ్చునని గ్రహించుకుంది టామీ. పొరపాటునైనా అది భోజనాల గదిలోనికి, వంటగది పరిసరాలకు పోయేది కాదు. ఈ ప్రవర్తన చూసిన అమ్మ "కుక్కముండకి ఎంత ఇంగితజ్ఞానం! ఎంత నియమం!" అని విస్తుపోయి క్రమంగా దానిమీద ప్రేమ, మమకారం పెంచుకుంది. దానికి కొంచెం

## గిడుగు రాజేశ్వరరావు

పాలూ, అన్నం తన చేతితో కలిపి పెరట్లో ఒక మూల పడేస్తేనేకాని అమ్మకు తన దినచర్య పూర్తిఅయినట్లు ఉండేదికాదు. రానురాను టామీకూడా మా అందరితోపాటు మా ఇంటిలో సభ్యత్వం పొందింది. మా తమ్ముడు అనంతానికి టామీమీద ప్రత్యేకంగా ద్వేషం ఏమీలేదు కానీ, గోపీమీద కోపం వచ్చినప్పుడు వాడిని ఏడిపించడానికి టామీని కొట్టేవాడు. ఆ భయంవల్ల టామీ గోపీని శరణు వేడేది. ఇలాగ మా అందరిమధ్య జీవిస్తున్నా, టామీకి గోపీ అంటే ప్రత్యేకమైన మమకారం, విశ్వాసం ఉండేవి. ఎవరి పనులలో వాళ్లు తీరిక లేకుండా ఉంటే గోపీ ఒక్కడే దానితో దినమంతా గడిపేవాడు. అదీ ఉత్సాహంగా గోపీతో ఆడుకునేది. వాడు బంతిని దూరంగా విసిరి తీసుకురమ్మంటే పరుగు పరుగున వెళ్లి నోటకరుచుకుని తీసుకువచ్చి వాడి చేతికి ఇచ్చి గర్వంగా తోక ఆడిస్తూ నిలిచేది. అమ్మచేత ఏ కారణంగానైనా దెబ్బలు తిని గోపీ ఏడుస్తూఉంటే తన చిన్న యజమానికేదో బాధ కలిగిందన్నట్లు చెంతజేరి ఊరడించేవిధంగా జాలిగా నిలబడేది. గోపీ ఎన్నడైనా, ఏ కారణంచేతనైనా కసిరినా, కొట్టబోయినా భయపడుతూ, బ్రతిమాలుకొనే భావనతో కళ్లలోకి చూసేది. గోపీ వెంటనే కరుణతో కరిగిపోయేవాడు. ఇలా గాఢంగా పెనవేసుకు పోయింది వాళ్ల స్నేహం. రాత్రికూడా టామీ వాడు పడుకునే మంచంకిందనే పడుకునేది. అది మామయ్య తెచ్చిన బొమ్మలాంటిది కాదు. గోపీతో ఆడుకుని వాడితో సంతోషాన్ని, దుఃఖాన్నికూడా పంచుకుంటుంది. వాడి యాజమాన్యాన్ని గౌరవిస్తుంది. ఆ కారణంచేత వాడికి కొత్త కొత్త ఆటవస్తువులు లేవని, సమవయస్కులైన స్నేహితులు లేరని చింత లేదు.


ఒక సంవత్సరం గడిచింది. కుక్కపిల్ల బొద్దుగా పెరిగింది. సాయంత్రం నేనూ, గోపీ ఎక్కడికైనా ఊరుబయట పొలాలగట్లు వెంబడి చల్లగాలికి పోయివస్తే అది మా వెంబడే వచ్చేది. ఒకనాడు గోపీ భోజనం చెయ్యలేదు. ఆకలి లేదన్నాడు. సాయంత్రం కాస్త జ్వరం తగిలింది. నాలుగు రోజులైనా జ్వరం తగ్గలేదు. డాక్టరుగారు పరీక్షించి "టైఫాయిడ్ అనుకుంటున్నాను. ఆహారం జాగ్రత్తగా ఇస్తే అదే తగ్గుతుంది" అని మందులు వ్రాసి ఇచ్చారు. గోపీ మంచంమీదనుండి దిగకుండా, ఆడుకుందుకు బయటకు వెళ్లకపోవడంవల్ల టామీకి ఏమీ తోచడం లేదు. మంచంచుట్టూ తిరుగుతుంది. అది ఎప్పుడైనా కాస్త దూరం పోయి అటూ ఇటూ తిరిగివచ్చి గోపీమంచం కింద పడుకునేది. జ్వరం కొన్ని దినాలకు తగ్గినట్లు తగ్గి మళ్లీ తిరగబెట్టింది. నాన్నగారు, అమ్మ, నేను ఒకరి తరవాత ఒకరుగా గోపీవద్ద రాత్రింబవళ్లు కూర్చుని డాక్టరుగారు చెప్పినట్లు మందులు వేళకు ఇచ్చి సంరక్షణ చేస్తున్నాం. గోపీ బాగా నీరసించిపోయాడు. విరోచనాలు ఎక్కువై ఇంత తేలిక ఆహారంకూడా ఇముడ్చుకోలేని స్థితిలో ఉన్నాడు. నిద్రలో కలవరింపుకూడా ఎక్కువైంది. ఒక ఉదయం "టామీ ఏదీ?" అని అడిగాడు. ఆ సమయానికి అది వీధిలోనికి పోయిందేమో! మంచం కింద లేదు. టామీని తెమ్మన్నాడు. "ఎక్కడికో వెళ్లింది. ఇప్పుడే

వస్తుందమ్మా, ఏడవకు" అన్నారు. మధ్యాహ్నం దాటినా టామీ ఇంటికి రాలేదు. నాకు కారణం తెలియలేదు.

గోపీ మంచం పట్టిన తరవాత టామీ ఇంతసేపు వాడి మంచం విడిచి వెళ్లలేదు. సాయంత్రం నాలుగు గంటలు కొట్టింది గోడ గడియారం. "టామీని తీసుకురావూ!" అన్నాడు గోపీ జాలిగా. సరే అని అమ్మతో చెప్పి నేను అలా వీధిలోనికి పోయి చూశాను. టామీ జాడ లేదు. ఏమైందో అర్థంకాక అలా ప్రసాదరావు ఇంటికి వెళ్లి సంగతి చెప్పాను. అక్కడకుకూడా టామీ రాలేదని చెప్పి, నాతో కలిసి కాస్త దూరం వచ్చి వెదికి "మన ఊరికి పడమరగా ఉన్న కొండ వెనక గొల్లపల్లెలు ఉన్నాయి. గొల్లలు మందకాపలాకి మంచి వాటికుక్కలను దొంగిలించి ఎత్తుకు పోతారని, తరవాత మచ్చిక చేసుకుంటారని అనుకుంటూ ఉంటారు. అలా ఏ గొల్లవాడైనా ఎత్తుకుపోయాడో ఏమో!" అన్నాడు. ప్రసాదరావు చెప్పినట్లు జరుగుతుందని ఊహించక ఏ లారీకిందనైనా పడిందేమో అనుకున్నాను. ఇంట్లో గోపీ టామీకోసం ఏడుస్తూ ఎంత మరిపించినా ఊరుకోడంలేదు. ఇంతలో నాకు ఒక ఆలోచన తట్టింది. టామీలాంటి ఇంకొక పిల్లను ప్రసాదరావు చౌదరిగారికి ఇచ్చినట్లు జ్ఞాపకం వచ్చింది. 'అదికూడా టామీ అంతే ఉంటుంది కదా! ప్రస్తుతానికి దానిని చౌదరిగారి ఇంటినుండి తెచ్చి గోపీకి చూపించి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించవచ్చు' నని ఆశ కలిగింది. వెంటనే వెళ్లి తీసుకువచ్చి గోపీ మంచం వద్దకు తీసుకువెళ్లి చేత్తో ఎత్తి పట్టుకున్నాను. మగతగా పడుకున్న గోపీని మెల్లిగా పిలిచి "టామీ ఇదిగో!" అన్నాను. మూసుకున్న కళ్లు ఉత్సాహంగా తెరిచి కుక్క కళ్లల్లోకి చూశాడు. అది గోపీ కళ్లలోకి భయంగా, కొత్తగా చూస్తూ, నా చేతులలోనుండి కిందికి జారిపోయి పారిపోయే ప్రయత్నం చేస్తోంది. గోపీ కన్నుల్లో ఉత్సాహం మాయమైంది. దాన్ని తిరిగి చూడకుండా కళ్లు మూసుకున్నాడు. "ఇది నా టామీ కాదు. నా టామీ ఇలా పారిపోతుందా? నన్ను మోసం చేశావు!" అని పలికాడు నన్ను ప్రశ్నించినంత బాధ కలిగింది నాలో. ఆ రాత్రే గోపీ పరిస్థితి విషమించి, మా అందరికి దూరమైపోయాడు.

సరిగ్గా వారం రోజుల తరవాత టామీ పరుగు పరుగున మా ఇంట్లోకి రావడం మా అందరినీ ఆశ్చర్యపరిచింది. బాగా చిక్కి శల్యమైంది. 'ప్రసాదరావు ఊహలో నిజం ఉంది. ఏ గొల్లల చేతుల్లోనో పడి తప్పించుకువచ్చిందేమో: పాపం!' అనుకుని దానిని దగ్గరికి తీసుకున్నాను. దాని మెడలో తెగిఉన్న సంకెల త్రాడు ముక్క వేలాడుతూంది. అది నన్ను విడిచి ఎవరో పిలిచినట్లు నేరుగా గోపీ పడుకుంటూ ఉండిన గదిలోకి పోయింది. అక్కడ గోపీ మంచం ఉండే స్థలాన్నంతా వాసన చూస్తూ, మూలుగుతూ పిచ్చిదానిలా తిరిగింది. తరవాత ఇల్లంతా ఏదో పోయిన వస్తువును వెతుకుతున్నట్లుగా తిరిగింది. దానిని చూస్తూన్న మా అందరి కన్నులలోను నీళ్లు సుడులు తిరిగాయి. దానికి ముందు ఏదైనా ఆహారం పెట్టాలని పాలు తెచ్చి పోశాను. పాపం, ఎన్ని ఉపవాసాలు చేసి ఇక్కడ చేరుకుందో కాని, ఆత్రతగా పాలు తాగింది. తోక ఊపుకుంటూ ఇల్లు అంతా మళ్లీ జ్ఞాపకం చేసుకుంటున్నట్లు తిరిగింది. అలా మేము పాలు పోసినది వారం రోజులు మాత్రమే. "తరవాత ఆ అవసరంకూడా లేకుండా పడి ఉంది ఒకనాడు."

ఫోటోలో ఉన్న ఆ చిన్నారి స్నేహితు లిద్దరిని చూస్తూ కథ వింటున్న నా కనురెప్పలకుంలో నీళ్ళు నిలిచి నా దృష్టికి అడ్డు పడ్డాయి. ★




## 11-5-69 నుండి 20-5-69 వరకు

పి. వి. రావు

### మేషం (అశ్వి.., భర.., కృత్తి. 1పా.)

గ్రహస్థితిలో వారారంభంలో మార్పు వస్తుంది. సంతానం, నూతన ఆదాయమార్గాలు, పెద్దవారికీ మీకూ మధ్య ఉన్న సంబంధం — మొదలైనవి ప్రాముఖ్యం వహిస్తాయి. మనుకయిలాగే మీ రాశి నాథుని అష్టమస్థితి వక్రవారం కొన్ని ఆటంకాలను కల్పిస్తాయి. అయితే హఠాత్తుగా ఏదో జరిగి పరిస్థితి సర్దుబాటు అవుతుంది. వక్రగురువు షష్ఠంలో బాధింపడం తప్పదు. కాని శుక్రవీక్షణం ఏదోవిధంగా ఆర్థిక సహాయం దొరికేట్టు చేస్తుంది. అనారోగ్య సూచనలున్నవి. పాత అప్పులు కొన్ని రాబట్టవచ్చు. ఉద్యోగంలో చింతా చికాకులూ ఉంటాయి. ఖర్చు లెక్కువ. ఫలితంతో పనికిరాని వ్యాపారస్థులకు లాభాలు ఎక్కువ. 14, 15, 17, 19 తేదీలు మంచి రోజులు.

### వృషభం

(కృత్తి 2,3,4 పా., రోహి., మృగ 1,2 పా.)

ప్రారంభంలోనే మీ రాశిలో రవి ప్రవేశం, ధన పుత్ర స్థానాధిపతి బుధుడు అక్కడే ఉండడం ఈ వారం హాయిగా గడుపుతాయి. ఆర్థికంగా అనుకున్నంత కంటె ఎక్కువగా వెసులుబాటు ఏర్పడుతుంది. బుధ గురు కోణం చాకచక్యంతో ముందుకు వెళ్లిపోయే తెలివితేటల నిస్తుంది. ఎన్నో మీ ఆలోచనలు కార్యరూపం ధరిస్తాయి. కుజ సప్తమ స్థితి దారిని నిరాటంకం చేస్తుంది. వివాహాది ప్రయత్నాలున్నచోట్ల ఫలితముంటుంది. వివాహితులకు గృహ శాంతి లోపించవచ్చు. ఆర్థిక రంగంలో మీకంటె పెద్దవారొకరు కొంత ఆందోళనకు కారణం కావచ్చు. ఉద్యోగంలో కొంత చింతా చికాకూ ఉండవచ్చు. వ్యాపారస్థులకు మంచి లాభకాలం. 14, 15, 17, 19, 20 తేదీలు మంచి రోజులు.

### మిథునం

(మృగ. 3,4 పా., ఆరు., పున. 1,2,3 పా.)

గత వారం కంటె మంచివారం. పనులు సక్రమంగా నెరవేరగలవు. బుధ రవి వ్యయస్థితి ఖర్చులు పెంచుతుంది. అయినా గురు శుక్ర పరస్పర వీక్షణం నిరాశ కలిగించదు. షష్ఠంలో కుజుడు ఆరోగ్యం చెడగొట్టవచ్చు. లేదా మీ పనులకు ఆటంకాలు కల్పించవచ్చు. దశమంలో శుక్రోచ్చ అలా జరగనివ్వదు. మీ పిల్లలలో ఒకరు పైకి వస్తారు. తర్వాత తర్వాత అధిక వ్యయకరమైన పథకాలను వేసుకోకండి. శని కుజ క్రూర వీక్షణం వాటిని నడవనియ్యవు. ఉద్యోగంలో బాగుంటుంది. వ్యాపారస్థులకు విదేశ వ్యాపారముంటే లాభకరి. 14, 15, 16, 17, 20 తేదీలు మంచి రోజులు.

### కర్కాటకం (పున 4 పా., పుష్య., ఆశ్లే.)

ఉద్యోగ వృత్తుల విషయంలో చింతా చికాకులతో వారం ఆరంభ మవుతుంది. అమావాస్య మీకు ఆటంకాలు కల్పిస్తుంది. ఒక రోజు తర్వాత పరిస్థితి మెరుగవుతుంది. 17 వ తేదీలోగా డబ్బు సర్దుబాటవుతుంది. మిత్రులు, బంధువులు, ఉత్తర ప్రత్యుత్తరాలు వగైరా వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. నిరాటంకంగా అనుకున్నది నెరవేరేందుకు బుధునిపై గురు వీక్షణం సాయపడుతుంది. 14 వ తేదీ తర్వాత పంచమ కుజుని రవి వీక్షణం మీ ఆర్థికావసరాల సర్దుబాటుకు తోడ్పడుతుంది. అయితే బుధ వీక్షణం డబ్బు విషయంలో కొన్ని మనస్తాపాలు తేవచ్చు. దూరంలో ఉన్న పుత్రాదుల నుంచి శుభ వార్తలు వింటారు. దూర ప్రయాణం జరగవచ్చు. జలుబు, దగ్గు లాంటివి రావచ్చు. వ్యాపారస్థులకు లాభకాలం. విదేశ వర్తకం బాగా లాభకారి. 14, 17 తేదీలు మంచి రోజులు.

### సింహం (మఖ. పూ. ఫ., ఉ. ఫ. 1 పా.)

గతంలోకంటె గ్రహస్థితి మెరుగయింది. 14వ తేదీ మధ్యాహ్నం పైన రవి దశమ ప్రవేశం ఉద్యోగాదులలో గౌరవస్థానం చేకూరుస్తుంది. మీ పనులు నిరాటంకంగా నెరవేరగలవు. గురు బుధ రవి కోణం మేలు చేస్తుంది. పేరు ప్రతిష్ఠలకు, డబ్బు సర్దుబాటులకు, నివేశ సౌఖ్యానికి దారితీస్తుంది. దూరప్రయాణమో, దూరంనుంచి శుభవార్తా శ్రవణమో కలదు. కుటుంబ సౌఖ్యం ఉంటుంది. సౌకర్యాలు మరింత కల ఇంటికి మారే అవకాశం కొన్నిట కలదు. తాత్కాలికంగా సోదరులలో ఒకరి విషయమై ఆందోళన కలగవచ్చు. విదేశ వర్తకం బాగా లాభిస్తుంది. భాగస్థులతో కలిసి కొత్త వ్యాపారాలు పెట్టవచ్చు. 14, 15, 17, 19 తేదీలు మంచి రోజులు.